క్లుప్తంగా

ఆర్‌ఐ పోస్టుల భర్తీ ఎప్పుడు?

సారవకోట: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌ఐ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇక్కడ ఇద్దరు ఆర్‌ఐలు ఉండాలి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినంత వరకు ఆర్‌ఐ బేగం విధులు నిర్వర్తించే వారు. కొన్ని నెలల క్రితం ఆమె బదిలీపై వెళ్లగా.. ఈ స్థానం ఖాళీగా ఉంది. సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న యు.లక్ష్మి ఆర్‌ఐగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గ్రామస్థాయిలో వీఆర్వోల నుంచి వచ్చిన దరఖాస్తులు పేరుకుపోతున్నాయి. సమస్యలు పరిష్కారం కావడంలేదని అర్జీదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

హెచ్‌ఎం తిరుమలరావుకు సత్కారం



తిరుమలరావుకు ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎంఈఓలు

కొత్తూరు: మండలంలోని పాతపానుటూరు యూపీ పాఠశాలలో సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కుదమ తిరుమలరావుకు ఆదివారం స్థానిక ఎమార్సీలో ఘనంగా సత్కరించారు. కుదమకు ఎంఈఓలు సి.హెచ్.గోవిందరావు, ఎస్.శ్రీనివాసరావు ప్రశంసాపత్రం అందజేశారు. విద్యార్థులకు గుణాత్మకమైన విద్యను అందిస్తూ.. పాఠశాల ప్రగతికి విశేష కృషిచేయడంతో కుదమ సేవలను మండల విద్యాశాఖ గుర్తించిందని ఎంఈఓలు తెలిపారు. ఇతర ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలవాలన్న ఆలోచనతోనే ప్రశంసాపత్రం అందించినట్లు చెప్పారు. కుదమ సేవలను కొనియాడారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఔదార్యం..



ఆర్థికసాయం అందజేస్తున్న రామ్‌జీ స్నేహితులు

నరసన్నపేట: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న డొప్పల పద్మకు భర్త రామ్‌జీ స్నేహితులు రూ.55 వేలు ఆదివారం అందజేశారు. పేద కుటుంబానికి చెందిన పద్మ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. వైద్య ఖర్చులకు ఇబ్బంది పడుతుండటంతో రామ్‌జీ (ఉర్లాం ఉన్నత పాఠశాలలో 1990–91, 1991–92లో టెన్త్ బ్యాచ్‌లు) స్నేహితులు విరాళాలు సేకరించారు. ఈ మొత్తాన్ని పద్మకు అందించారు. ఉర్లాం ఎంపీటీసీ నడిమింటి లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రూ.60 వేల ఆర్థికసాయం



ఆర్థిక సహాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

సారవకోట: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు వారితో చదువుకున్న తోటి విద్యార్థి కుటుంబానికి రూ.60 వేల ఆర్థికసాయాన్ని ఆదివారం అందించారు. 1995–96 బ్యాచ్ (టెన్త్)కు చెందిన దున్న పార్థసారధి ఇటీవల శ్రీకాకుళంలో అనారోగ్యంతో మృతి చెందారు. ఆ కుటుంబాన్ని ఆదుకోవాలనే ఆలోచనతో తోటి స్నేహితులు విరాళాలు సమీకరించి పార్థసారధి భార్యకు శ్రీకాకుళం వెళ్లి అందజేశారు. అడపా సింహాచలం, ఇప్పిలి సుధాకర్, చింతు గోవింద, తూలుగు ఆనందరావు, ఈశ్వరరావు, వేణు, కృష్ణ తదితరులు ఉన్నారు.

పాముకాటుతో రైతుకు అస్వస్థత



మెళియాపుట్టిలో చికిత్స పొందుతున్న లచ్చన్న

మెళియాపుట్టి: మండల కేంద్రానికి చెందిన సిరిపురం లచ్చన్న తన పొలంలో (ఒడిశాలోని దవిడిగాం గ్రామంలో) ఆదివారం వరిచేను కోస్తుండగా పాముకాటు వేసింది. తనతోపాటు పనిచేస్తున్న కొంతమందిని పిలిచి చూపించగా పాము కాటేసిందని నిర్ధారించుకుని వెంటనే ద్విచక్ర వాహనంపై మెళియాపుట్టి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువచ్చారు. ఇక్కడ ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన చికిత్స కోసం టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు.

రహదారి పనుల నిలిపివేత

పాతపట్నం: మేజర్ పంచాయతీ పరిధిలోని కాపు గోపాలపురం, హరిజన గోపాలపురం మీదుగా పర్లాకిమిడిని (ఒడిశా రాష్ట్రం) కలిపే సీసీ రహదారి పనులను పర్లాకిమిడి రైల్వే అధికారులు ఆదివారం నిలిపివేశారు. రైల్వే ట్రాక్‌కు అనుకుని ఈ రహదారి ఉందని రైల్వే అధికారులు తెలిపారు. హరిజన గోపాలపురం నుంచి నేరుగా పర్లాకిమిడికి 500 మీటర్ల మేరకు రహదారి పనులు నిలిచిపోయాయి. కాపుగోపాలపురం, హరిజన గోపాలపురం గ్రామస్తులు పర్లాకిమిడి రైల్వే స్టేషన్‌కు వెళ్లి అధికారులను కలిసి రహదారి పనులు చేపట్టేందుకు సహకరించాలని కోరారు.

అంగన్‌వాడీలపై.. ధరల భారం



అంగన్‌వాడీ కేంద్రంలో మధ్యాహ్న భోజనం చేస్తున్న చిన్నారులు

- పాత చార్జీలతోనే మెనూ అమలు చేయాలంటున్న ప్రభుత్వం
- అప్పుల పాలవుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు
- మెనూ చార్జీలు పెంచాలని వేడుకోలు

హిరమండలం: నిత్యవసరాల ధరలు భారీగా పెరగడంతో అంగన్‌వాడీలు సతమతమవుతున్నారు. కూరగాయలు, నిత్యవసరాల ధరలు అమాంతం పెరిగినా ప్రభుత్వం తాము చెప్పిన మెనూ ప్రకారమే చిన్నారులకు మహధ్యాహ్న భోజనం అందించాలని ఆదేశాలు జారీచేయడంతో వీరి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అప్పులు చేసి చిన్నారులకు పౌష్టికాహారం అందించాల్సిన పరిస్థితి నెలకొంది. పాతపట్నం నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 456 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందజేయాల్సి ఉంటుంది. అంగన్‌వాడీలకు ప్రభుత్వమే బియ్యం, నూనె, కందిపప్పు, గుడ్లు, పాలు అందజేస్తోంది. చిన్నారుల సంఖ్యకు అనుగుణంగా ఎంత మేరకు సరుకులు అవసరమో నివేదిక అందజేస్తే ఆ మేరకు సరుకులు పంపిణీ చేస్తారు. కందిపప్పు, బియ్యాన్ని రేషన్ దుకాణాల ద్వారా అంగన్‌వాడీలు ప్రతినెలా తెచ్చుకోవాల్సి ఉంటుంది. సరుకులు తరలించుకునేందుకు, కేంద్రంలో జాగ్రత్తగా నిల్వ చేసుకునేందుకు ప్రభుత్వం ఎటువంటి నగదు చెల్లించదు.

పాతపట్నం నియోజకవర్గంలో అంగన్‌వాడీ కేంద్రాల వివరాలు	
మండలం	అంగన్‌వాడీ కేంద్రాలు
పాతపట్నం	105
హిరమండలం	78
కొత్తూరు	108
మెళియాపుట్టి	108
ఎల్.ఎన్.పేట	61

కేటాయింపులు ఇలా..

ఒక్కో చిన్నారికి రోజుకు 75 గ్రాముల బియ్యం, 15 గ్రాముల పప్పు, 5 గ్రాముల నూనెను మాత్రమే ప్రభుత్వం కేటాయిస్తుంది. నెలసరి కూరగాయల కోసం రూ.800 చెల్లిస్తోంది. గ్యాస్ సిలిండర్ కోసం నెలకు రూ.400 ఇస్తోంది. వీటితోనే చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించాల్సి ఉంటుంది.

మెనూ ఇలా..	
సోమవారం	దోసకాయ పప్పు
మంగళవారం	పులిహోర, టమాట పప్పు
బుధవారం	ఆకుకూర పప్పు
గురువారం	కాయగూరలతో సాంబారు
శుక్రవారం	కూరగాయల పప్పు
శనివారం	వెజిటబుల్ రైస్, ఆకుకూర, సాంబారు

భారీగా పెరిగిన ధరలతో..

ప్రస్తుతం కూరగాయల ధరలు భారీగా పెరిగిపోయాయి. ప్రభుత్వం కూరగాయల నిమిత్తం నెలకు కేటాయించే రూ.800 సరిపోవడంలేదు. గ్యాస్‌కు సైతం నగదు సక్రమంగా చెల్లించడం లేదు. పలు సందర్భాల్లో సొంత సొమ్ము పెట్టి తెచ్చుకోవాల్సిన పరిస్థితి. మెనూ తప్పక పాటించాలని చెప్పే ఉన్నతాధికారులు పెరిగిన ధరలకు అనుగుణంగా నగదు మొత్తాన్ని మారిస్తే బాగుంటుందని అంగన్‌వాడీలు అంటున్నారు. ప్రస్తుతం ఇస్తున్న ఉచిత గ్యాస్ అంగన్‌వాడీ కేంద్రాలకు కూడా అందిస్తే ఉపయుక్తంగా ఉంటుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి మెనూ చార్జీలను పెంచి అందిస్తే ఎంతో ఊరటగా ఉంటుందని కోరుతున్నారు.

కేంద్రాల నిర్వహణకు చేతి సొమ్ము..

చిన్నారులు, గర్భిణులు, బాలింతలు వచ్చే అంగన్‌వాడీ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచాలి. ఇందుకోసం సబ్బులు, చీపుర్లు, చాపలు, తదితర వస్తువుల కొనుగోలుకు ప్రభుత్వం నగదు అందజేయాలి. ప్రభుత్వం నుంచి అందకపోతుండడంతో అంగన్‌వాడీలు తమ సొంత నగదు వెచ్చించి వీటిని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

ఉన్నతాధికారులకు నివేదించాం



పెరిగిన ధరలకు అనుగుణంగా నగదు పెంపు విషయాన్ని ఇదివరకే అంగన్‌వాడీలు తమ దృష్టికి తీసుకువచ్చారు. ప్రస్తుతం అంగన్‌వాడీలకు కూరగాయలు, ఇతర అవసరాలకు అందజేస్తున్న నగదు పెంపు విషయమై ఉన్నతాధికారులకు ఇప్పటికే నివేదించాం.

– యు.విమలకుమారి, ఐసీడీఎస్ సీడీపీఓ కొత్తూరు

శాంతియుత సమాజమే శ్రేయస్కరం

- మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం



మాజీ స్పీకర్ సీతారాంను సన్మానిస్తున్న బ్రాహ్మణ సంఘం సభ్యులు

ఆమదాలవలస: శాంతియుతంగా ఉన్నప్పుడే సమాజ పురోగతి సాధ్యమవుతుందని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మున్సిపాలిటీ పరిధి ఊసవానిపేటలో ఆదివారం బ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు బి.రాజేష్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక వనమహోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ విద్య, ఉపాధి, ఉద్యోగ రంగాల్లో బ్రాహ్మణ యువత ముందు వరుసలో నిలవాలని ఆకాంక్షించారు. బ్రాహ్మణ సంఘ ప్రధాన కార్యదర్శి కర్రి రవి ప్రసాద్, సంఘం పెద్ద డాక్టర్ మల్లెల కృష్ణప్రసాద్, సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు లక్ష దీపారాధన

హిరమండలం: మండల కేంద్రంలోని చిన్నకోరాడ వీధిలో గల ఉమారుద్ర కోటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మూడో సోమవారం పురస్కరించుకుని సాయంత్రం ఐదు గంటల నుంచి లక్ష దీపారాధన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. ప్రతిఏటా కార్తీక మాసం మూడో సోమవారం లక్ష దీపారాధన నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. దీపారాధనలో భక్తులు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొనాలని కమిటీ సభ్యులు కోరారు.

అర్చకులకు ఘన సన్మానం



అర్చకులకు సన్మానిస్తున్న తమినేని సీతారాం, పిరియా విజయ, పేరాడ తిలక్, తదితరులు

జలుమూరు: బాలియాత్రను విజయవంతం చేసిన శ్రీముఖలింగం అర్చకులకు టెక్కలి నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ కన్వీనర్ పేరాడ తిలక్ ఆదివారం ఆలయ ఆవరణలో ఘనంగా సన్మానించారు. బాలియాత్ర విశిష్టత తెలియజేసిన నిర్వాహకులను సత్కరించి ఫలదానాలు అందించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ పి.విజయ, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, వైద్యుడు దువ్వాడ జీవితేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకర మలుపు



ఈ చిత్రం సరుబుజ్జిలి మండలం పొన్నాంపేట సమీపంలోని మలుపు. ఆమదాలవలస నుంచి సరుబుజ్జిలి మండలం రొట్టవలస వరకు ఆర్అండ్‌బీ రహదారిలో 12 మలుపులున్నాయి. ఆ మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఎదురుగా వచ్చే వాహనాలు పూర్తిగా కనిపించడంలేదు. రహదారికి ఇరువైలా తుప్పలు పెరిగిపోవడంతో మరింత ఇబ్బందికరంగా ఉంటుంది. హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

– సరుబుజ్జిలి

ప్రమాదకరం..



పాతపట్నం మండలం తామర గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం, మూడు రోడ్ల కూడలి పక్కనే మూడు అడుగుల ఎత్తులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. దీని చుట్టూ కంచె ఏర్పాటు చేయలేదు. అంగన్‌వాడీ కేంద్రం, ఎంపీపీ పాఠశాల సమీపంలోనే ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతోందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ ఎత్తును పెంచాలని, లేకపోతే కంచె ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

– పాతపట్నం

పోటెత్తిన భక్తులు



ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం పాతపట్నం గ్రామదేవత నీలమణి దుర్గ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. కార్తీకమాసం కావడంతో అమ్మవారి ఆలయానికి తెల్లవారుజామునుంచే స్థానికులతోపాటు ఒడిశా ప్రాంతానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారికి కుంకుమ, ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. పలువురు భక్తులు వాహన పూజలు కూడా చేశారు.

– పాతపట్నం

సందడిగా కార్తీక వనభోజనం



కొత్తూరు మండలంలోని నేతాజీనగర్ కాలనీ (ఎస్‌ఎస్ కాలనీ)కి చెందిన పలు కుటుంబాలవారు ఆదివారం కార్తీక వన భోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు, చిన్నారులు ఆటపాటలతో సందడి చేశారు. నేతాజీనగర్‌లో పలు వీధులు ఉన్నాయి.. వీటికి పేర్లు లేవు. కాలనీలో ఉన్న మొదటి వీధికి అనుకొని ఉన్న వీధులకు గణేష్ వీధిగా నామకరణం చేశారు. ఈ కార్యక్రమం వరసిద్ధి వినాయక మిత్ర మండలి సభ్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు.

– కొత్తూరు

బకాయిలు వెంటనే చెల్లించాలి



మాట్లాడుతున్న కిశోర్‌కుమార్

నరసన్నపేట: కూటమి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, ఆర్థిక బకాయిలన్నీ తక్షణమే చెల్లించాలని యూటీఎఫ్ డిమాండ్ చేసింది. స్థానిక ప్రథమికోన్నత పాఠశాలలో ఆదివారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిశోర్‌కుమార్ మాట్లాడుతూ పీఎఫ్, సరెండర్ లీవులు, ఏపీజీఎల్ఐసీ పేమెంట్స్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇదే తత్సార్యం కొనసాగితే ఆందోళన కార్యక్రమాలకు కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామని హెచ్చరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామ్మూర్తి, జిల్లా గౌరవ అధ్యక్షుడు కోరాడ వైకుంఠరావు మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థి కె.విజయగౌరీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం యూటీఎఫ్ మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా టి.సుధీర్, ఉపాధ్యక్షులుగా ఆర్.బాబూరావు, బి.విశాలాక్షి, ప్రధాన కార్యదర్శిగా ఆదినారాయణ, కోశాధికారిగా పి.కృష్ణారావు ఎన్నికయ్యారు. పలువురు యూటీఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

కళింగ వైశ్యుల బలోపేతానికి కృషి



పర్లాకిమిడికి చెందిన కళింగ వైశ్యులను సత్కరిస్తున్న దృశ్యం

పాతపట్నం: జిల్లాలోని నిరుపేద కళింగ వైశ్యుల అభివృద్ధికి అందరూ కలిసి కృషి చేయాలని పాతపట్నం, పర్లాకిమిడికి చెందిన కళింగ వైశ్యుల సంఘం ప్రతినిధులు ఎస్.మధుబాబు, కళివరపు మధు, కే.శేఖర్, రమణ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఆల్‌ఆంధ్రా రోడ్డు సమీపంలో కళింగ వైశ్యుల వన భోజన కార్యక్రమం నిర్వహించారు. పర్లాకిమిడికి చెందిన పలువురు కళింగ వైశ్యులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళింగ వైశ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చెడు వ్యసనాలతో జీవితాలు నాశనం



అవగాహన కల్పిస్తున్న సీఐ ప్రసాదరావు

కొత్తూరు: యువత గంజాయి, మద్యం వంటి చెడు వ్యసనాలకు అలవాటు పడితే జీవితం నాశనం అవుతుందని స్థానిక సీఐ చింతాడ ప్రసాదరావు అన్నారు. మండలంలోని సిరుసువాడలో ఆదివారం రాత్రి గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. మత్తు పదార్థాలు విక్రయించినా, అక్రమంగా రవాణ చేసినా కేసులు నమోదు చేస్తామన్నారు. ఇటీవల సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మైనర్లకు బైక్‌లు ఇవ్వకూడదన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎస్ఐ ఎం.ఎ.అహ్మద్, పోలీసులు పాల్గొన్నారు.

శివపార్వతులకు ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు, గ్రామస్తులు

హిరమండలం: పాత హిరమండలంలోని ఎండల మల్లికార్జున స్వామి ఆలయ ప్రాంగణంలో గ్రామస్తుల సహకారంతో ప్రతిష్ఠించిన శివపార్వతులు, నంది విగ్రహాలకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు సింగుపురం ధర్మలింగం, ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు చేపట్టారు. భక్తులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

త్రినాథ స్వామికి పుష్పాలంకరణ



సారవకోట మండలం వడ్డినవలస గ్రామంలో గల త్రినాథ స్వామికి ఆదివారం వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. కార్తీక మాసం కావడంతో సారవకోట, జలుమూరు మండలాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. అర్చకులు మనోజ్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

– సారవకోట

కొసమాల విద్యార్థి ప్రతిభ



అనిరుధ్ బాబు

మెళియాపుట్టి: ఐఎస్ఎస్ఐ పీజీ (ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేషనల్ ఇంపార్టెన్స్) సెట్‌లో మండలంలోని కొసమాల గ్రామానికి చెందిన అంకడాల అనిరుధ్ బాబు సత్తాచాటాడు. ఆల్ ఇండియా 272వ ర్యాంక్ సాధించాడు. ఈ ఫలితాలు శనివారం రాత్రి విడుదలయ్యాయి. అనిరుధ్ తల్లిదండ్రులు తేజేశ్వరరావు, రమాదేవి, గ్రామస్తులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

చేప పిల్లల పంపిణీ



నౌగూడ చెరువులో చేప పిల్లలను విడిచిపెడుతున్న ఎమ్మెల్యే గోవిందరావు

హిరమండలం: మండలంలోని నౌగూడలో గిరిజన మత్స్యకారులకు ఫింగర్ లెవల్ చేప పిల్లలను పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరిజన ఉప ప్రణాళిక పథకం ద్వారా 169 మత్స్యకార గిరిజన చెరువులకు వంద శాతం సబ్సిడీపై చేప పిల్లలను ప్రభుత్వం అందజేస్తున్నట్లు తెలిపారు. జిల్లా మత్స్యకార అధికారి పి.వి.శ్రీనివాసరావు, ఏడీ సంతోష్ కుమార్, ఎంపీడీఓ ఆర్.కాశీప్రసాద్, జెడ్పీటీసీ సభ్యుడు పి.బుచ్చిబాబు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు టి.తిరుపతిరావు, సర్పంచ్ లంక రోజారాణి, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని కాపాడుకుందాం



చింతాడలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న మిస్కా కృష్ణయ్య, తదితరులు

ఆమదాలవలస: మన రాజ్యాంగాన్ని కాపాడుకుందామని రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక నాయకుడు, కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిస్కా కృష్ణయ్య పిలుపునిచ్చారు. ఈ నెల 26న శ్రీకాకుళంలోని ఏడు రోడ్ల కూడలి నుంచి అంబేడ్కర్ కూడలి వరకు నిర్వహించనున్న ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధి చింతాడలో ఆదివారం కరపత్రాలను ఆవిష్కరించారు. సామాజిక న్యాయ పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి డి.గణేష్, అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు రాకోటి రాంబాబు, ముచ్చ గణేష్, దుప్పాడ లక్ష్మీనారాయణ, మన్నెల నేలమనాయుడు, రాగోలు బాలకృష్ణ, తోట సురేష్, రాగోలు రామారావు, దుప్పాడ నాయుడు, వంక గణేష్, పెంట నరసింహమూర్తి, రాగోలు మల్లేష్, రాగోలు చరణ్, తోట రామకృష్ణ పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే అభివృద్ధి సాధ్యం



సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

మెళియాపుట్టి: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో మౌలిక సదుపాయాల కల్పనకు, సమస్యల పరిష్కారానికి అధికారులు, సభ్యులు సహకరించాలని ఎంపీపీ రాణా ఈశ్వరమ్మ అన్నారు. మండలంలోని ఉపాధి కార్యాలయం ఆవరణలో ఆదివారం నిర్వహించిన మండల సాధారణ సర్వసభ్య సమావేశానికి అధ్యక్షత వహించారు. పలువురు సభ్యులు మాట్లాడుతూ.. మండలంలోని పలు గ్రామాల్లో పాఠశాల భవనాలు లేవని, కొన్నిచోట్ల శిథిలావస్థలో ఉన్నాయని, వాటిపై దృష్టి సారించాలని కోరారు. పలు శాఖలకు చెందిన అధికారులు ఆయా శాఖల వివరాలు తెలియజేశారు. ఎంపీడీఓ నరసింహ ప్రసాద్ పండా, తహసీల్దార్ పాపారావు తదితరులు పాల్గొన్నారు.

రహదారి పనులు ప్రారంభం

కొత్తూరు: మండలంలోని కర్లెమ్మ పంచాయతీ పరిధి ఎస్ఎస్ కాలనీలోని 4, 9వ వార్డుల్లో రూ.7.50 లక్షల అంచనాతో సీసీ రోడ్డు పనులను సర్పంచ్ లోతుగెడ్డ భగవాన్‌నాయుడు ఆదివారం ప్రారంభించారు. పంచాయతీలో దశల వారీగా సీసీ రోడ్ల నిర్మాణం చేపడతామన్నారు. జేఈఈఈ దుర్గాప్రసాద్, మాజీ సర్పంచ్ పడాల వెంకటకృష్ణ, వార్డు మెంబర్లు కాదూరి వాసు, మునకాల సంతు, రామకృష్ణ పాల్గొన్నారు.

అక్కులపేటలో వైద్య శిబిరం



అక్కులపేటలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు తాతయ్యలు

ఆమదాలవలస: మండలంలోని అక్కులపేట, వేణమ్మపేటల్లో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం సాయి పల్లకి సేవ నిర్వహించి ఇంటింటికీ స్వామివారి ప్రసాదం అందజేశారు. అమృతకలశాలు, దుప్పట్లు పంపిణీ చేశారు. డాక్టర్ పి.తాతయ్యలు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. జోనల్ కన్వీనర్ ఎం.సాయి, జిల్లా యూత్ కన్వీనర్ జనార్ధనరావు, సమితి కన్వీనర్ సూర్యారావు, జిల్లా గ్రామసేవ ఇన్‌చార్జి ఎం.రవీంద్రబాబు, యూత్ కో ఆర్డినేటర్ సాయికృష్ణ, నిఖిత, సంజన తదితరులు పాల్గొన్నారు.